అవిశ్వాసం అటకెక్కినట్లేనా..?

- బీజేపీ పిలుపునకు స్పందన కరువు
- మేయర్‌పై మాటల యుద్ధం
- రూ. 472 కోట్లతో అభివృద్ధి చేశామంటున్న బీఆర్‌ఎస్
- జనం కట్టిన పన్నులతోనే అభివృద్ధి: కాంగ్రెస్

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లో అవిశ్వాస తీర్మానం పెట్టడానికి తాము సిద్ధంగా ఉన్నామని బీజేపీ ప్రకటించినా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల కార్పొరేటర్లు ముందుకు రావడం లేదు. సంఖ్యాబలం తక్కువ ఉన్న బీజేపీతో కలిసి వెళ్లేందుకు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు(15 మంది), కాంగ్రెస్ కార్పొరేటర్లు(7 మంది) అయిష్టత చూపుతున్నారు. జనరల్ ఎలెక్షన్లు వచ్చే అవకాశం ఉందని కొందరు.. ఏడాది కోసం కోట్లు ఖర్చు చేయడం ఎందుకని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు విముఖత చూపుతున్నట్లుగా తెలుస్తోంది. అధికార పార్టీ అయినా, కాంగ్రెస్ పార్టీ అయినా మాతో కలిసి వస్తే మద్దతు ఇస్తామని బీజేపీ చెబుతున్నా ఇరు పార్టీలు మాత్రం పెడచెవిన పెట్టడంతో బీజేపీ ఎత్తుగడలు బెడిసికొట్టినట్లయింది.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య ముదురుతున్న విభేదాలు

అవిశ్వాస తీర్మానం సంగతి పక్కన పెట్టి పది రోజుల నుంచి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు, కార్పొరేటర్ల మధ్య వైరం నెలకొంది. కార్పొరేషన్ అభివృద్ధికి కేటాయించిన నిధుల చుట్టూ విమర్శలు, ప్రతి విమర్శలు మొదలు పెట్టారు. మరో అడుగు ముందుకు వేసి అధికార పార్టీకి ద్రోహం చేసి పార్టీ మారిన మేయర్ పారిజాత పదవికి రాజీనామా చేయాలని బీఆర్‌ఎస్ వర్గీయులు పట్టుబడుతున్నారు. హస్తం గుర్తుపై గెలిచి అధికార పార్టీలోకి వెళ్లిన మేయర్ పారిజాత మంత్రి సబితారెడ్డి ముందు రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్గీయులు, కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. ఇలా ఒకరిపై ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటుండటంతో బడంగ్‌పేట కార్పొరేషన్‌లో అసలు ఏం జరుగుతుందో అర్థం కాక ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. మంత్రి సబితారెడ్డి సహకారంతో బడంగ్‌పేట కార్పొరేషన్‌కు రూ. 472 కోట్ల నిధులను పలు గ్రాంట్ల కింద తీసుకొచ్చి అభివృద్ధి చేశామని బీఆర్‌ఎస్ నాయకులు చెబుతుండగా, రూ. 210 కోట్లతో ప్రజలు కట్టిన పన్నులతోనే అభివృద్ధి జరిగిందని వేరే ఫండ్ రాలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందన్న బీజేపీకి ఇరు పార్టీలు చేసుకుంటున్న ఆరోపణలు, ప్రత్యారోపణలతో ఏం జరుగుతోందో ఎవరికీ అర్థం కావడం లేదు. అవిశ్వాస తీర్మానంతో ఎంతో కొంత లాభం ఉండకుండా పోతుందా అని ఆశగా ఎదురు చూస్తున్న కొంత మంది కార్పొరేటర్లకు పార్టీల నుంచి వ్యక్తిగత విమర్శల వరకు పోతున్న పోకడలను చూస్తుండటంతో మింగుడుపడటం లేదని ఇరు పార్టీల్లోని కొందరు ఆశావహ కార్పొరేటర్లు మండిపడుతున్నారు. పార్టీల్లో గొడవలు, పంచాయితీలు ఎప్పుడూ ఉండేవే.. ఓ పట్టాన కొలిక్కిరావు.. కానీ దింపుడు కళ్లెం (అవిశ్వాస తీర్మానం) దగ్గరకొచ్చింది.. ఎమైనా సదురుకుందామని ఆశావహ కార్పొరేటర్లు ఎదురుచూస్తున్నారని వినికిడి. ఇంతకీ అవిశ్వాసం అయ్యేనా? అటకెక్కేనా ? అర్థం కావడం లేదని పలువురు కార్పొరేటర్లు గొనుక్కుంటున్నారు. ఇదిలా ఉండగా ఎవరికివారు ఆరోపణలు, విమర్శలు చేసుకుంటూ బడంగ్‌పేట కార్పొరేషన్ అభివృద్ధిని మరచి అసంతృప్తి పనుల గురించి ఏ పార్టీ నాయకులు మాట్లాడడం లేదని బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలను బడంగ్‌పేట కార్పొరేషన్ ప్రజలు విమర్శలు చేస్తుండడం గమనార్హం.


బడంగ్‌పేట కార్పొరేషన్ భవనం

మహిళా భవన్ ఏర్పాటుకు కృషి

మంత్రి సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని డాక్టర్స్ కాలనీలో మహిళా భవన్‌ను ఏర్పాటు కృషి చేస్తానని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. బుధవారం డాక్టర్స్‌కాలనీ ప్రధాన కార్య దర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో మహిళా మండలి సభ్యులు మంత్రి సబితారెడ్డిని కలిసి భవనం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భవన నిర్మాణంకో సం స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పార్టీలకతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామమూర్తి, ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మహిళా మండలి సభ్యులు మమత, సరిత, నిత్య, రమా, రజిని, సంధ్య, వాణి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.


మంత్రి సబితారెడ్డితో డాక్టర్స్‌కాలనీ మహిళా మండలి సభ్యులు

విద్యార్థులకు వైద్య పరీక్షలు


చిన్నారులకు పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

మీర్‌పేట: నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ చైర్మన్ షరీఫ్ తెలిపారు. మీర్‌పేట ఆర్‌ఎన్‌రెడ్డి నగర్‌లోని పాఠశాలలో బుధవారం గ్లోబల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు జ్యోత్స్న, లక్ష్మి, శాంతిప్రియ, శ్రీనిధి.. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇచ్చారు. పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్, ప్రెసిడెంట్ జైపాల్‌రెడ్డి, డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మోడల్ స్కూల్ అభివృద్ధికి సహకరిస్తాం: కృష్ణారెడ్డి


ప్రిన్సిపాల్‌కు నగదు అందజేస్తున్న వంశీధర స్కూల్ యాజమాన్యం

మహేశ్వరం: పట్టణంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని నాదర్‌గుల్ వంశీధర స్కూల్ చైర్మన్ కే కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహేశ్వరం ప్రభుత్వ మోడల్ స్కూల్‌ను సందర్శించి మౌలిక వసతుల కల్పనకు రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి సబితారెడ్డి చొరవతో మోడల్ స్కూల్ ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ బీ ధనుంజయ్, మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ రవి నాయక్ పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

కౌన్సిలర్ లావణ్య


మహిళకు చెక్కు అందజేస్తున్న కౌన్సిలర్

తుక్కుగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని కౌన్సిలర్ సప్పిడి లావణ్య అన్నారు. మున్సిపాలిటీలోని 13వ వార్డుకు చెందిన జమాల్‌పురి ఉమారాణి అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు. ఆర్థిక సాయం కోసం మంత్రి సబితారెడ్డి సిఫారసు చేయగా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు మంజూరయ్యాయి. బుధవారం ఇందుకు సంబంధించిన రూ.65 వేల విలువ చేసే చెక్కును కౌన్సిలర్ లావణ్య లబ్ధిదారులకు అందజేశారు.

నేడు ఉచిత వైద్యశిబిరం


కడ్తాల్: గ్రేస్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గూడూరు భాస్కర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సాధారణ జ్వరంతో పాటు రక్తపరీక్షలు, ఈసీజీ, షుగర్, బీపీ, కాళ్ల నొప్పులు, కీళ్లనొప్పులు, మోకాళ్లనొప్పులతో పాటు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు


రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు బుధవారం హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రతిష్ఠించే విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, ఆలయ నిర్మాణ దాత రేగట్టి శ్రీనివాసులు, నాయకులు.. శ్రీలత, కౌసల్య, చంద్రయ్య, అంబిక, మురళి, శివస్వాములు సాయిలు, అశోక్, వెంకట్, పద్మ, ప్రశాంత్, మహేశ్, శ్రీను, దోని, అంజి, వెంకటేశ్, దుర్గాప్రసాద్, దేవరాజు, గోవర్ధన్, శివ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ జంప్లానాయక్‌కు ఘన సన్మానం


జంప్లానాయక్‌కు స్వీటు తినిపిస్తున్న నేతలు

కడ్తాల్: మండల కేంద్రంలో వైద్య కేంద్రాన్ని నిర్వహిస్తూ పరిసర ప్రాంత ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలందిస్తున్న గిరిపుత్రుడు డాక్టర్ జంప్లానాయక్ ఉస్మానియా ఆస్పత్రిలో అసిస్టెంట్ సిటీ సర్జన్‌గా పదోన్నతి పొందటం పట్ల యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ మాట్లాడుతూ.. పేద ప్రజల డాక్టర్‌గా జంప్లానాయక్ అందిస్తున్న వైద్య సేవలు ప్రశంసనీయమని అన్నారు. వివేకానంద యూత్ అధ్యక్షుడు మాధవులు, సభ్యులు శ్రీకాంత్, వినయ్, మల్లేశ్ పాల్గొన్నారు.

పదోన్నతులు చేపట్టాలంటూ నిరసన

కందుకూరు: భాషా పండితుల ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎల్‌టీఏ జేఏసీ జిల్లా కన్వీనర్ ఎండీ బషీర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బుధవారం మండలంలోని గూడూరు జిల్లా పరిషత్ పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ 2017లో భాషా పండితుల పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తున్నామని, జీఓ నంబర్లు 2,3, 110 ఇచ్చి, వాటిని అమలు చేయడం మరిచారన్నారు. దీంతో తోటి ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు జరుగుతుంటే, హైస్కూళ్లలో బోధించే తెలుగు, హిందీ, ఉర్దూ పండిట్లను పక్కన పెట్టడం సరికాదన్నారు. 20 ఏళ్లుగా పండిట్లను ఎమ్మెల్సీ ఓటు బ్యాంక్‌గా వాడుకుంటున్నారే తప్పా పదోన్నతులు ఇవ్వలేదని ఆరోపించారు.


ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయండి

కాంగ్రెస్ కార్పొరేటర్ల వినతి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని వెంటనే సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు చల్లా కవిత, సిద్దాల మౌనిక డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు కమిషనర్ నాగేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 90 రోజులకు ఒక్కసారి సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉండగా, 150 రోజులైనా ఏర్పాటు చేయకపోవడంతో ఏ ఒక్క సమస్యా పరిష్కారం కావడం లేదన్నారు. ముఖ్యంగా డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుద్ధ్య సమస్య, సిబ్బంది కొరతపై పలు సార్లు ఫిర్యాదు చేసినా స్పందించిన దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవి సమీపిస్తున్నందున నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందని, కొన్ని కాలనీలు, బస్తీల్లో మూడు రోజులకు ఒక్కసారి మంచినీటి సరఫరా అవుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు అన్నారు. మూడేళ్ల కాలంలో బడ్జెట్‌లో ఏయే డివిజన్లకు ఎన్ని నిధులు కేటాయించారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ కార్పొరేటర్లు, డీసీసీ అధ్యక్షుడు

బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటే: చల్లా

అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ కార్పొరేటర్లు 15 మంది ఉన్నా ఏనాడూ ప్రజా సమస్యలపై గళమెత్తలేదని, వారికి సొంత ప్రయోజనాలే ముఖ్యమని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా బీజేపీ పనిచేస్తోందని మండిపడ్డారు. ఇద్దరు కార్పొరేటర్లు ఉన్న కాంగ్రెస్ పార్టీ నెల రోజులుగా అధిక పన్నులు, నల్లా బిల్లులపై నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. ఇటీవల మంత్రి స్పందించి ఇంటి పన్నుల తగ్గింపుపై తీర్మానం చేయాలని ఆదేశించారని, అదే విధంగా వీలైనంత త్వరగా సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులకు మంత్రి ఆదేశాలు ఇవ్వాలని చల్లా నర్సింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, నాయకులు కీసర యాదిరెడ్డి, ఆలా శ్రీనివాస్‌రెడ్డి, ఐతరాజు భాస్కర్, శేఖర్‌రెడ్డి, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే చోరీల నియంత్రణ


దొంగతనాల నివారణపై కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

కార్పొరేటర్ సిద్దాల బీరప్ప

మీర్‌పేట: ప్రజల సహకారం ఉంటే దొంగతనాలు, చోరీలను నియంత్రించవచ్చని మీర్‌పేట 7వ డివిజన్ కార్పొరేటర్ సిద్దాల బీరప్ప కోరారు. బుధవారం డివిజన్ పరిధి లక్ష్మీనగర్‌కాలనీ పార్కులో మీర్‌పేట పోలీసులు ప్రజలకు దొంగతనాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. శివారు ప్రాంతాల్లో నూతనంగా వెలసిన కాలనీలను దృష్టిలో పెట్టుకుని పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేయడంతో పాటు కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సీసీ కెమెరాలతో దొంగతనాలను నివారించవచ్చని తెలిపారు. లక్ష్మీనగర్‌కాలనీ, ఆర్‌ఎన్‌రెడ్డినగర్ ప్రాంతాల్లో 80 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు కార్పొరేటర్ బీరప్ప తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఎస్‌ఐలు బద్యానాయక్, గోవిందస్వామి, బీఆర్‌ఎస్ నాయకులు దోమలపల్లి రాజ్‌కుమార్, కాలనీ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి నరేష్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

మహేశ్వరంలో గులాబీ జెండా ఎగురవేద్దాం

యూత్ కమిటీ అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన ముద్దా పవన్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్లు తాళ్ల కార్తీక్, నాగనందీశ్వర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి సుమంత్‌రెడ్డి తదితరులను మండల యూత్ కమిటీ అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో మరోసారి గులాబీ జెండా ఎగిరేలా యువత కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చిర్ర సాయిలు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జి పన్నాల కృష్ణారెడ్డి, కన్వీనర్ సాంబశివ, డైరెక్టర్లు ఆనంద్, దేవీలాల్, యూత్ నాయకులు పాల్గొన్నారు.


యువజన విభాగం నేతలను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

ఓవర్‌టేక్ చేయబోయి..

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
బైకిస్టు దుర్మరణం

మహేశ్వరం: ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయిన ఓ ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మహేశ్వరం సీఐ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం... హయత్‌నగర్ మండలం పెద్దంబర్‌పేట్ ఆనంద్‌నగర్ కాలనీకి చెందిన రచ్చ శ్రీనివాస్(60) చేనేత పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం పెద్దంబర్‌పేట్ నుంచి ఆమన్‌గల్‌కు తన స్కూటీపై వెళ్తుండగా.. మెహబూబ్‌నగర్ గేటు సమీపంలో అచ్చంపేట్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందుగా వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న స్కూటీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న రచ్చ శ్రీనివాస్‌కి తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహాధర్నాకు తరలిరండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్


సమావేశంలో మాట్లాడుతున్న కిషన్

తుర్కయంజాల్: అర్హులందరికీ ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, మహిళా సంఘం, కేవీపీఎస్ ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్ అన్నారు. రాగన్నగూడలోని సీఐటీయూ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అనేకమంది పేదలు ఇళ్ల స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే అర్హులందరికీ ఉండేందుకు సొంత గూడు కల్పించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తులసిగారి నర్సింహ, మహిళా సంఘం నాయకులు శారద, కేవీపీఎస్ నాయకులు భాస్కర్, కుమార్, డీవైఎఫ్ఐ నాయకులు శ్రీధర్, కార్మిక సంఘం నాయకులు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అనర్థాలపై నృత్య ప్రదర్శన

బడంగ్‌పేట్: పల్లవి ఆవేర్ పాఠశాలలో నిర్వహించిన నిర్విఘ్న నృత్య ప్రదర్శనకు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు వరించింది. నాదర్‌గుల్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన పల్లవి ఆవేర్ ఇంటర్నేషనల్ పాఠశాలలో విద్యార్థులకు మొబైల్ ఫోన్ల నుంచి వచ్చే దుష్ప్రభావాలను తెలియజేయాలనే ఉద్దేశంతో 7 వందల మంది విద్యార్థులతో 15 నిమిషాల పాటు నిర్విఘ్న నృత్య ప్రదర్శన నిర్వహించి రికార్డును సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ మల్కా కొమురయ్య మాట్లాడుతూ.. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపుతాయని, మొబైల్ ఫోన్ల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో సిబ్బంది కృషిని అభినందించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. విద్యార్థులు ఏకధాటిగా 15 నిమిషాలపాటు ఆగకుండా నిర్వహించిన నృత్య ప్రదర్శనను గుర్తించిన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అనితా రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాధిక, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియన్ చీఫ్ కోఆర్డినేటర్ నరేందర్‌గౌడ్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ తెలంగాణ కోఆర్డినేటర్ విజయరంగ, కొరియో గ్రాఫర్లు శివకుమార్, అనుదీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మెమెంటోతో పాఠశాల డైరెక్టర్ అనితారెడ్డి

విదేశీ వద్దు.. స్వదేశీ వస్తువులే ముద్దు

ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి

హస్తినాపురం: విదేశీ వస్తువులు వద్దు స్వదేశీ వస్తువులు ముద్దు స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి అన్నారు. కేవీ రమణాచారి 71వ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని ఎల్‌బీనగర్ జోన్ కర్మన్‌ఘాట్‌లోని స్థానిక ఉత్పత్తుల కేంద్రం చైర్మన్ భరత్ సంఘం ఆధ్వర్యంలో త్రివర్ణ దళాలు, ఆదర్శ రైతులు, కళాకారులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ బత్తిని సాయిశ్రీ, వనస్థలిపురం, ఎల్‌బీనగర్ ఏసీపీలు పురుషోత్తంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మీర్‌పేట కమిషనర్ నాగేశ్వర్, ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి, డీఐ సైదులు కాలనీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రమణాచారి

జాతీయ లంగిడి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఆమనగల్లు: తమిళనాడులోని తిరుచూర్‌లో ఇటీవల జరిగిన 13వ సీనియర్ జాతీయ లంగిడి పోటీలలో ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థినులు శ్వేత, పల్లవి, కిరణ్మయి, అరుణ, స్వాతి రాష్ట్ర టీం నుంచి జాతీయ లంగిడి పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చేసి 4వ స్థానంలో నిలిచారు. విద్యార్థినులు శ్వేత, పల్లవి, కిరణ్మయి, అరుణ, స్వాతిని బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు ప్రేమకుమారి, సుశీల అభినందించారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.


విద్యార్థినులతో హెచ్‌ఎం పద్మ

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేసి ఆకట్టుకున్నారు. డీఈఓగా వర్షిణి, ఎంఈఓగా కల్యాణ్, ప్రధానోపాధ్యాయునిగా అక్షిత్, ఉపాధ్యాయులుగా శివకుమార్, రక్షిత, సహస్ర, హారిణి, శ్రీలేఖ, శ్రేయాన్, కుషాల్‌లు వ్యవహరించారు. చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

సంక్షేమ పథకాల అమలు ఘనత కేసీఆర్‌దే

హస్తినాపురం: పేద ప్రజలు, బడుగు బలహీన వర్గాలు అణగారిన ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్రంలో అనేక పథకాలు ప్రవేశ పెట్టి వాటిని పకడ్బందీగా అమలు పరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. బుధవారం నందనవనం కాలనీలో స్థానికులతో కలిసి కార్పొరేటర్ సుజాతానాయక్ మార్నింగ్ వాక్ చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలైన షాదిముబారక్, కళ్యాణ లక్ష్మి, వృద్ధాప్య, వితంతు పింఛన్లతోపాటు దళితబంధు పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు పరుస్తుందని అన్నారు. ఈనెల 11న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సుజాతనాయక్ పిలుపునిచ్చారు.


నందనవనం కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్